సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



టన్ను చీనీ రూ.26 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.26 వేలు, కనిష్టంగా రూ.12 వేలు, సరాసరిన రూ.18 వేలు ధర పలికాయి.



కిలో టమాట రూ.16

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.6 , సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం
32.2°/16.1°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీడీ వెంకటనారాయణ

పుట్టపర్తి అర్బన్: జిల్లా హౌసింగ్ పీడీగా వెంకటనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబును ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. విజయవాడలోని హౌసింగ్ శాఖ రాష్ట్ర కార్యాయంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయనను ఇటీవల జిల్లాకు ప్రభుత్వం బదిలీ చేసింది.

'ఆడుదాం ఆంధ్రా'లో పాల్గొనండి



క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఉదయ్ భాస్కర్

పుట్టపర్తి: రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరూ 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో పాల్గొనాలని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఉదయ్ భాస్కర్ కోరారు. సోమవారం బుక్కపట్నం బాల,బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సన్నాహక మ్యాచ్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ యువతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పోటీలు నిర్వహిస్తోందన్నారు. యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శాంతమ్మ, పీడీ నాగరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఉప సర్పంచ్ మృతి



రాజ్యలక్ష్మి (ఫైల్)

పెద్దవడుగూరు : రావులుడికి పంచాయతీ ఉప సర్పంచ్ రాజ్యలక్ష్మి (34) విద్యుదాఘాతంతో మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు... కోనాపురంలో నివాసముంటున్న రాజ్యలక్ష్మి సోమవారం ఉదయం ఇంటి ముందర శుభ్రం చేసుకుంటోంది. మెట్లపై శుభ్రం చేసేందుకని స్టేరకేస్‌ను పట్టుకుని పైకి ఎక్కుతుండగా విద్యుత్ షాక్ కొట్టగానే కిందకు పడిపోయింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను కుటుంబ సభ్యులు రాయలచెరువులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే రాజ్యలక్ష్మి చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

రేపు ఉద్యోగ మేళా

అనంతపురం: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్, ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత/ఫెయిల్ అయిన 32 సంవత్సరాల్లోపు వయసున్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎంపికైన వారు గుంతకల్లు, రాయదుర్గం, అనంతపురం,తాడిపత్రి, పెనుకొండ, కదిరి, గోరంట్ల, హిందూపురం, కళ్యాణదుర్గం, ఉరవకొండలోని ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ -ఎస్‌బీఎఫ్‌సీ సంస్థ బ్రాంచుల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు జీతభత్యాలు ఉంటాయని వెల్లడించారు. అభ్యర్థులు బయోడేటాతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 63053 00106, 95506 76098, 83285 28338 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పేదల సంజీవని ఆరోగ్యశ్రీ

- రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం
- కలెక్టర్ అరుణ్‌బాబు
- లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డుల అందజేత

పుట్టపర్తి అర్బన్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు సంజీవనిలా మారిందని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్ సమూల మార్పులు తీసుకొచ్చి వైద్య రంగంలో సువర్ణాధ్యాయాన్ని లిఖించారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీలో వివిధ చికిత్సల వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ సీఎం వైఎస్ జగన్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల పంపిణీని సోమవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్ర నాయక్, వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ దీపికా రెడ్డి, డీపీఎం కుల్లాయప్ప నాయక్ వీక్షించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకూ ఆరోగ్యశ్రీ పథకం కింద 1,38,885 సర్జరీలు జరగ్గా, ప్రభుత్వం సుమారు రూ.296.82 కోట్ల వ్యయం చేసిందన్నారు. ఈ క్రమంలోనే కొత్త ఫీచర్లతో ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులను తీసుకొచ్చిందన్నారు. ఆరోగ్య శ్రీ సేవలు ఎలా పొందాలి, ఎవరిని సంప్రదించాలి అనే వివరాలు కార్డుల్లో నిక్షిప్తం చేశారన్నారు. జిల్లాలో 5.33 లక్షల కుటుంబాలకు మంగళవారం నుంచి ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రూ.1,000కిపై బడిన ప్రతి చికిత్సకూ ఉచితంగా వైద్యం అందించనున్నట్లు చెప్పారు. ప్రజలు ఆరోగ్య శ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' మొదటి విడత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని, రెండో విడత జనవరి నుంచి ప్రారంభమవుతుందన్నారు. అనంతరం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించిన కదిరి ఏరియా ఆసుపత్రి సేవా ఆరోగ్య మిత్ర హరిక్రిష్ణకు ప్రశంసాపత్రం, రూ.5 వేలు అందజేశారు.



లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మెడికల్ కళాశాలల ఘనత సీఎం జగన్‌దే ..

రాష్ట్రంలో రూ. వేల కోట్లతో 17 మెడికల్ కళాశాలలు నిర్మిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్సీ మంగమ్మ, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, హిందూపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ దీపికారెడ్డి పేర్కొన్నారు. 'ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డుల' పంపిణీ అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారని కొనియాడారు. గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, వ్యాధిగ్రస్తులకు వైఎస్సార్ పెన్షన్ కానుక, 104, 108 సర్వీసుల్లో సమూల మార్పులు తీసుకొచ్చి సేవలను మెరుగుపరిచారన్నారు. ఆరోగ్య శ్రీ కింద 3,752 రోగాలకు ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఇంతలా పేదలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి దేశంలోనే ఎక్కడా లేరని స్పష్టం చేశారు. పేద ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.

గతంలో ఎన్నడూ లేదు



ఆరోగ్యశ్రీ పేరు చెబితే దివంగత నేత వైఎస్సార్, సీఎం వైఎస్ జగన్ గుర్తుకొస్తారు. ఈ పథకం ప్రతి పేద వాడికీ ఎంతో మేలు చేస్తోంది. రూ.25 లక్షల దాకా ఖర్చు చేయడం శుభపరిణామం. గతంలో ఎన్నడూ ఇలాంటి సీఎంను చూడలేదు. పేదలను ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌ను ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి.

– సాయిలక్ష్మి, చిత్రావతి రోడ్డు, పుట్టపర్తి

జీవితాంతం రుణపడి ఉంటాం



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకొచ్చారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రవేశపెట్టి గ్రామాల్లోనే మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకున్నారు. పేదలకు పెద్ద రోగాలు వచ్చినా 'ఆరోగ్యశ్రీ' ద్వారా ఆదుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– శివశంకర్, పుట్టపర్తి

గ్రూప్-1,2 ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



పుట్టపర్తి అర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్ 1, గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ కోసం అనంతపురం బీసీ స్టడీ సర్కిల్ వారు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి నిర్మలాజ్యోతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-2కు ఈ నెల 22 లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వంద మందికి ఈ నెల 27 నుంచి 45 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తారు. గ్రూప్ -1 అభ్యర్థులు ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలి. 60 మందికి జనవరి 5 నుంచి 60 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేస్తారు. డిగ్రీలో వచ్చిన మార్కులు, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. బయోడేటాతో పాటు 10, ఇంటర్, డిగ్రీ మార్కుల లిస్టులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (తల్లిదండ్రులకు రూ.లక్ష లోపు వార్షిక ఆదాయం ఉండాలి), ఆధార్, బ్యాంక్ పాస్ బుక్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతపరచాలి. అనంతపురం పెన్నార్ భవన్ పక్కన ఉన్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలి.

పచ్చ నేతల బరితెగింపు



సోమందేపల్లి మండలం మాగే చెరువు గ్రామ సమీపంలో ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రం వద్ద ప్రహరీ కూల్చిన టీడీపీ నాయకుడు



తలుపుల: శ్మశాన స్థలం కబ్జాపై తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న తలుపుల మండలం బలిజపేట వాసులు

సోమందేపల్లి/తలుపుల: తెలుగుదేశం పార్టీ నాయకులు బరితెగిస్తున్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో చేసిన అరాచకాలకు మళ్లీ తెర లేపుతున్నారు. వచ్చేది తమ పార్టీనే అంటూ భయకంపితుల్ని చేస్తున్నారు. టీడీపీ నాయకుడు, సోమందేపల్లి మాజీ జెడ్పీటీసీ వెంకటరమణ సోమవారం రెచ్చిపోయాడు. మండలంలోని మాగే చెరువు గ్రామ సమీపంలో ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని దురాక్రమణ చేసేందుకు యత్నించాడు. ప్రహరీని ధ్వంసం చేశాడు. సాలిడ్ వేస్ట్ మెనేజ్‌మెంట్ కేంద్రాన్ని నామరూపాల్లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే వారిపై దౌర్జన్యం చేశాడు. మీ ఇష్టమొచ్చిన చోట చెప్పుకోండి అంటూ చిందులేశాడు.

శ్మశాన స్థలం ఆక్రమించాడు..

- తలుపుల మండలంలో కూడా ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. టీడీపీ నేత చాంద్‌బాష (సోఫిన్ టైలర్) ఆ మండలంలోని బలిజపేట గ్రామ సమీపంలో ఉన్న శ్మశాన స్థలాన్ని కబ్జా చేశాడు. సమాధులను సైతం చదును చేసేశాడు. శ్మశానం పక్కన ఉన్న వంకను ఆక్రమించుకున్నాడు. ఈ రెండు ఘటనలపై ఆయా గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా, అధికారంలో ఉన్న సమయంలో రెచ్చిపోయిన టీడీపీ నాయకులు.. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మళ్లీ తమ పార్టీనే వస్తుందంటూ అరాచకాలకు తెరలేపడంపై ప్రజలు విస్తుపోతున్నారు.

సమస్య తీర్చి నమ్మకం పెంచుదాం

- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు పిలుపు
- 'స్పందన'కు 264 అర్జీలు

పుట్టపర్తి అర్బన్: ''ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'స్పందన'ను తీసుకొచ్చింది. కార్యక్రమంలో అందే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి. ప్రభుత్వంపై నమ్మకం పెంచాలి'' అని కలెక్టర్ అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో 'స్పందన' నిర్వహించారు. కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు జేసీ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, గ్రామ, వార్డు సచివాలయాల నోడలాఫీసర్ శివారెడ్డి తదితరులు ప్రజల నుంచి మొత్తం 264 అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రానికి వ్యయ ప్రయాసలకోర్చి వచ్చి ప్రజలు వినతిపత్రాలు అందిస్తారన్నారు. అర్జీదారుని వద్దకు వెళ్లి సమస్యను పూర్తిగా తెలుసుకుని పరిష్కరిస్తే నమ్మకం పెరుగుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు దాటకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాష, సర్వే ల్యాండ్ అండ్ రికార్డ్స్ ఏడి రామక్రిష్ణ, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీహెచ్‌ఓ చంద్రశేఖర్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డీపీఓ విజయ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- పెనుకొండ మండలం కురుబవాండ్లపల్లికి చెందిన దాదులూరప్ప భార్య పెద్దక్కకు బైరాపురం పొలంలో సర్వే నంబర్ 380-2ఎంలో 1.86 ఎకరాలు ఉంది. భూమి 22ఏ జాబితాలో ఉండడంతో ఇబ్బంది పడుతున్నామని, సమస్య పరిష్కరించాలని పెద్దక్క కోరారు.
- తనకు సర్వే నంబర్ 80-18లో ప్లాట్ నంబర్ 26 కేటాయించినా ఇంత వరకూ సర్వే చేసి హద్దులు చూపలేదని బత్తలపల్లి మండలం కోడెకొండ్ల బీసీ కాలనీకి చెందిన శ్రీరాములు తెలిపారు. తగిన చర్యలు చేపట్టేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- హిందూపురం మండలం పోచంపల్లికి చెందిన బలిజ రామలక్ష్మమ్మ 50 సెంట్ల స్థలాన్ని హంద్రీ నీవా కాలువ నిర్మాణం కోసం 2010లో సేకరించారు. ఇప్పటి వరకూ పరిహారం అందలేదని బాధితురాలి వాపోయారు. పరిహారం అందించాలని కోరారు.
- బత్తలపల్లి మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన ఆది ఆంధ్రా పెద్దన్నకు సర్వే నంబర్ 312-3లో 5.4 ఎకరాలు ఉంది. ఆ భూమిని కంసల క్రిష్ణయ్య అనే వ్యక్తి దొంగ వీలునామా రాయించుకొని పట్టాదారు పాస్ పుస్తకం పొందాడని పెద్దన్న కుమారుడు దారా శంకర్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయాలని కోరారు.

చిన్న పొరపాటుకూ తావివ్వొద్దు



మాట్లాడుతున్న ఎలక్టోరల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి

- ఎలక్టోరల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి పక్కాగా రికార్డులు నిర్వహించాలని, చిన్న పొరపాటుకు కూడా తావివ్వరాదని ఎలక్టోరల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని 'స్పందన' సమావేశ మందిరంలో కలెక్టర్ అరుణ్‌బాబుతో కలిసి ఓటరు జాబితా సవరణపై ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కాగా రికార్డులు నిర్వహించాలన్నారు. భారత ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలన్నారు. ప్రొసీజర్ ప్రకారం ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. క్లెయిములు పెండింగ్ ఉంచరాదని సూచించారు. నిబంధనలు పాటించకపోయినా, డాక్యుమెంటేషన్ లేకున్నా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫారం 6,7,8లపై ప్రత్యేక దృష్టి సారించి, ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. రికార్డుల పరిశీలన కోసం క్షేత్రస్థాయిలో మంగళవారం పుట్టపర్తి, ధర్మవరం మున్సిపాలిటీలు, కొత్తచెరువు మండలకేంద్రంలో పర్యటించనున్నట్లు చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తొలగింపులు, నమోదుపై నిర్దిష్టమైన ఆధారాలు, రాతపూర్వక ఫిర్యాదులు అందిస్తేనే చర్యలు తీసుకోవాలన్నారు. తప్పుడు సమాచారమిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. మార్పులు, చేర్పులు, తొలగింపుల దరఖాస్తులను పది రోజుల్లో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీక్రిష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

కాన్వొకేషన్ పట్టా పొందేదెట్టా..?

- ఫీజు భారీగా పెంపు
- నిబంధనలు విస్మరించిన ఎస్కేయూ
- ఏకంగా రూ.వెయ్యి పెంపుదల
- విద్యార్థులపై పెను భారం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవంలో పట్టా అందుకోవాలనుకున్న విద్యార్థులపై కాన్వొకేషన్ రుసుం పెంపు గుదిబండగా మారింది. 21వ స్నాతకోత్సవంలో రూ.2,500 ఉండే పట్టా (ఇన్ అడ్వాన్స్‌డ్) ఫీజు తాజాగా రూ.3,500కు పెంపుదల చేశారు. ఒకేసారి రూ.1,000 ఫీజు పెంచడం భారంగా పరిణమించింది. 21వ స్నాతకోత్సవ రుసుం 2023 జూలై 20 వరకు ఉంది. ఈ స్నాతకోత్సవానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు నేరుగా వారి ఇంటికే పట్టాలు పంపుతారు. తాజాగా ఉత్తీర్ణత చెందిన వారు ఇన్‌అడ్వాన్స్‌డ్ కింద స్నాతకోత్సవానికి దరఖాస్తు చేసుకుంటారు. 22వ స్నాతకోత్సవం వరకు నిరీక్షించకుండా ముందుగానే డిగ్రీలు తీసుకుంటారు. ఉన్నత కోర్సుల్లో అడ్మిషన్లు రావడం, ప్రైవేట్ ఉద్యోగాలు, ప్రభుత్వ ఉద్యోగాలు పొందడం తదితర అంశాల నేపథ్యంలో ఇన్‌అడ్వాన్స్‌డ్ కింద దరఖాస్తుకు ఆసక్తి చూపుతుంటారు. వాస్తవానికి ప్రతి స్నాతకోత్సవానికీ 10 శాతం మేర ఫీజు పెంపుదల చేయవచ్చని నిబంధన ఉన్నప్పటికీ దానిని విస్మరించి ఏకంగా రూ.1,000 మేర ఫీజు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం విమర్శలకు దారితీస్తోంది. దూరవిద్య డిగ్రీ పట్టాకు రూ.4,200, దూరవిద్య పీజీ ఇన్‌అడ్వాన్స్‌డ్ కింద రూ. 5,400 మేర చెల్లించాల్సి ఉంది. 2023లో ఇన్‌అడ్వాన్స్‌డ్ కింద ఏడు వేల మందికి పైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోనున్నారు. వీరిందరికీ ఆర్థికభారం కానుంది. ఫీజులు తగ్గించాలని విద్యార్థులు కోరుతున్నారు.



ఎస్కేయూ ముఖద్వారం

మిగతా యూనివర్సిటీల కన్నా తక్కువే!

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నిర్ధారించిన స్నాతకోత్సవ రుసుం రాష్ట్రంలోని ఇతర వర్సిటీల ఫీజుల కంటే తక్కువగా ఉంది. గతంలో ఎన్నడూ పెద్దగా పెంపుదల చేయలేదు. విద్యార్థులకు అందించే జవాబు పత్రాల రేటు విపరీతంగా పెరిగిపోయింది. పరీక్ష విభాగం అంటే పరీక్ష నిర్వహించినప్పటి నుంచి ఫలితాలు ప్రకటించేంత వరకు పెద్ద మొత్తంలో నిధులు వినియోగించాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఇతర యూనివర్సిటీలు నిర్ధారించిన మేరకే ఫీజులు నిర్దేశించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకున్నాం.

– ప్రొఫెసర్ జీవీ రమణ, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్, ఎస్కేయూనివర్సిటీ



ఆంజనేయస్వామికి జ్యోతులు తీసుకెళుతున్న మహిళలు



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

కనుల పండువగా జాతర

కుందుర్పి: మండలంలోని మహంతపురం గ్రామంలో సోమవారం ఈరన్నస్వామి, చిత్రలింగేశ్వరస్వామి జాతర ఉత్సవం కనుల పండువగా జరిగింది. ఉదయం విశేష అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆంజనేయస్వామికి జ్యోతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ పన్నేరపు బండ్లను తిప్పారు. సాయంత్రం ఈరన్న, చిత్రలింగేశ్వర స్వాముల ఉత్సవ మూర్తులకు భారీ ఎత్తున ఊరేగింపుతో గ్రామ శివారులోని ఈడు వద్దకు చేర్చి పూజలు నిర్వహించారు. ఈడు చుట్టూ ఆవులు, పశువులు, గొర్రెలను ప్రదక్షిణ చేయించి మొక్కులు తీర్చుకొన్నారు. మంగళవారం పాతప్ప జాతరను పురస్కరించుకుని సాయంత్రం గ్రామ శాంతి, వెండి పల్లకీ ఉత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

'పోలీస్ స్పందన'కు 31 వినతులు



అర్జీదారుతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ విష్ణు

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 31 వినతులు అందాయి. అదనపు ఎస్పీ విష్ణు స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చేపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు

ముమ్మర గాలింపు చర్యలు



ఎంపీఆర్‌లో గల్లంతైన యువకుడి కోసం గాలిస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

కూడేరు: మండల పరిధిలోని మిడ్ పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్) బ్యాక్ వాటర్‌లో గల్లంతైన యువకుడి కోసం పోలీసుల గాలింపు చర్యలు రెండో రోజూ సోమవారమూ కొనసాగాయి. ఉరవకొండకు చెందిన ధనుంజయ కుమారుడు ఆర్య తన స్నేహితులతో కలసి ఆదివారం డ్యాం సందర్శనకు వెళ్లి బ్యాక్ వాటర్‌లో గల్లంతైన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న పోలీసులు మత్స్యకారులు, గజ ఈతగాళ్లను రంగంలో దించి ఆదివారం చీకటి పడే వరకూ గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో సోమవారం ఉదయం కూడేరు ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది నేతృత్వంలో విస్తృత గాలింపు చర్యలు కొనసాగాయి. చీకటి పడడంతో గాలింపు చర్యలను నిలిపి వేశారు. మంగళవారం తిరిగి గాలింపు చేపడతామని ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు. కాగా, ఆర్య గల్లంతు విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆదివారం నుంచి అక్కడే రోదిస్తూ ఉన్నారు.

కారు బోల్తా - ఒకరి మృతి





లోయలో పడిన కారు, సంఘటన స్థలంలో మృతి చెందిన హసీబా కౌసర్

పెనుకొండ రూరల్: కారు బోల్తా పడిన ఘటనలో ఓ మహిళ మృతిచెందింది. మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురం పట్టణానికి చెందిన హసీబా కౌసర్(55) తన కుటుంబ సభ్యులతో కలసి సోమవారం రాత్రి కారులో అనంతపురానికి బయలుదేరారు. పెనుకొండ మండలం దుద్దేబండ క్రాస్ సమీపంలోకి చేరుకోగానే కారు టైర్ పేలడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వాహనం పక్కనే ఉన్న లోయలోకి దూసుకెళ్లింది. ఘటనలో హసీబా కౌసర్ అక్కడికక్కడే మృతి చెందింది. కారు నడుపుతున్న ఇలియాజ్ స్వల్ప గాయాలుతో బయటపడ్డాడు. అటుగా వెళుతున్న వారు గమనించి క్షతగాత్రుడిని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఓటర్లను చైతన్య పరచడమే స్వీప్ లక్ష్యం

- అవగాహన కోసం హోర్డింగ్‌లు, ఫ్లెక్సీల ఏర్పాటు
- వంద శాతం ఓటింగే సాధన లక్ష్యంగా కార్యక్రమాలు



స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్

పుట్టపర్తి అర్బన్: నైతిక విలువలతో కూడిన ఓటింగ్ వైపు ఓటర్లు పయనించేలా చైతన్య పరచడం, ఓటింగ్‌లో భాగస్వాములను చేయడమే లక్ష్యంగా 'క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్య కార్యక్రమాన్ని (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రామ్ - స్వీప్)' ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించి యువతను ఓటరుగా చేర్పించే కార్యక్రమాలను జిల్లా అధికారులు విస్తృతం చేశారు. నెల రోజులుగా స్వీప్ కార్యక్రమాలు మరింత ఊపందుకున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు నియమించి, స్వయంగా ఆయనే పర్యవేక్షిస్తున్నారు. నోడల్ అధికారులుగా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి శివరంగప్రసాద్, ఆర్ఐఓ రామకృష్ణారెడ్డిని నియమించారు. వీరిద్దరి నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా కళాశాలల్లోని విద్యార్థులకు ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓ ఓటు హక్కుపై అవగాహన కల్పించి 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయిస్తున్నారు. అలాగే ఓటు హక్కు వినియోగంపై గ్రామస్థాయిలో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా చర్యలు తీసుకున్నారు.

ప్రణాళికాబద్ధంగా అడుగు..

స్వీప్ కార్యక్రమానికి సంబంధించి పుట్టపర్తి, హిందూపురం, కదిరి, ధర్మవరం తదితర మున్సిపాలిటీల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఎల్ఈడీ టీవీలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన పెంచుతున్నారు. ఈ నెల 9వ తేదీ నాటికి స్పెషల్ సమ్మరీ రివిజన్ పూర్తి కాగా, ఇక ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. త్వరలో ఓ ప్రణాళిక మేరకు గ్రామాల్లో, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇక ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక వసతులు కలిగిన పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడానికి కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి తదితర జిల్లా అధికారులు అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి నివేదికను సిద్ధం చేస్తున్నారు.

కొత్త ఓటరు నమోదుకు 44,121 దరఖాస్తులు

ఓటరు జాబితా సవరణలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు, కొత్త ఓటరు నమోదుకు ఈ నెల 9వ తేదీతో గడువు ముగిసింది. అక్టోబర్ 17 నుంచి నిర్దేశిత గడువు లోపు జిల్లాలోని పుట్టపర్తి, కదిరి, హిందూపురం, ధర్మవరం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల పరిధిలో కొత్తగా ఓటరు నమోదుకు 44,121 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇవన్నీ స్పెషల్ క్యాంపెయిన్, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా సమర్పించారు.మార్పులు, చేర్పులుకు 20,326 దరఖాస్తులు, తొలగింపులకు 32,217 దరఖాస్తులు అందాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వాటికి సంబంధించి ధ్రువీకరణ పత్రాలను క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలు, సిబ్బంది పర్యటించి పరిశీలిస్తున్నారు.

ఈ నెల 9వ తేదీ వరకు అందిన దరఖాస్తులు

నియోజకవర్గం	ఫారం-6	ఫారం-7	ఫారం-8
మడకశిర	3,225	784	1,374
హిందూపురం	6,518	993	2,340
పెనుకొండ	5,619	2,104	3,749
పుట్టపర్తి	7,448	2,902	1,946
ధర్మవరం	11,484	18,687	7,660
కదిరి	9,827	6,747	3,257

- ఫారం-6: కొత్తగా ఓటరు నమోదు చేసుకునేందుకు
- ఫారం-6: ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగింపునకు
- ఫారం-6: జాబితాలో మార్పులు, నివాసం మార్పునకు

అభ్యంతరాలను పరిష్కరిస్తాం



ఓటరు జాబితా సవరణలో భాగంగా అభ్యంతరాలను పరిష్కరించిన అనంతరమే తుది ఓటరు జాబితాను విడుదల చేస్తాం. 2024, జనవరి 5వ తేదీన ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తప్పులు లేని తుది ఓటరు జాబితాను విడుదల చేయబోతున్నాం. – అరుణ్‌బాబు, జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్

పేదల వైద్యానికి సీఎం జగన్ పెద్దపీట



చిల్లవారిపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

- కునుకుంట్లలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి

తాడిమర్రి: పేదల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్యానికి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. తాడిమర్రి మండలం చిల్లవారిపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన సీపీ రోడ్డు, కునుకుంట్లలో రూ.20 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సోమవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. గ్రామాల్లో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. వైద్య చికిత్స కోసం ఎన్నో అవస్థలు పడుతూ సుదూర ప్రాంతాలకు గ్రామీణులు వెళ్లకుండా ఉన్న ఊళ్లోనే ప్రతి సచివాలయం పరిధిలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. షుగర్, బీపీతో పాటు ఇతర రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన వైద్య చికిత్సలు అందిస్తున్నారన్నారు. గత నెల జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కిడ్నీ, గుండె, ఊపిరితిత్తులు, మహిళల సమస్యలు, కంటి సమస్యలు తదితర జబ్బులకు ఉచితంగా చికిత్సలు, మందులు అందించడమే కాక అవసరమున్న రోగులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించారన్నారు. వైఎస్సార్‌కంటి వెలుగు కింద వేలాది మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేసి, అద్దాలను అందజేశామన్నారు. ఇప్పటి వరకూ రూ.5 లక్షల వరకు ఉన్న ఆరోగ్యశ్రీ వైద్యసేవలను రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంచిందన్నారు. దీంతో పేదలకు ఎలాంటి జబ్బు వచ్చినా డబ్బులు లేదని చింతాల్సిన పనిలేదన్నారు.

రమణారెడ్డి ఔదార్యాన్ని కొనియాడిన ఎమ్మెల్యే

కునుకుంట్ల గ్రామంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సల్లాపురం బాల రమణారెడ్డి తన తల్లి జ్ఞాపకార్థం రూ.15 లక్షలు విలువజేసే 10 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇవ్వడాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి కొనియాడారు. ఆ స్థలంలోనే సకల హంగులతో క్లినిక్ నిర్మాణం పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి రావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ వడ్డి లావణ్య, ఎంపీటీసీ సభ్యుడు పెద్దన్న, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ నాగరాజు, వైద్యులు ఎం.హరిత, గోవర్ధన్ నాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌కుమార్, ఎంఈఓలు కృష్ణమోహన్, వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ లక్ష్మి, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, ఏఎన్ఎం సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

భార్య మౌనం.. భర్త ఆత్మహత్య



మల్లికార్జున (ఫైల్)

యాడికి: భార్య మాట్లాడకుండా మౌనం వహించడంతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి గ్రామానికి చెందిన వంశరాజుల రామన్న కుమార్తె లక్ష్మికి ఉరవకొండకు చెందిన మారన్న పెద్ద కుమారుడు మల్లికార్జున (26)తో 2020లో వివాహమైంది. వీరికి 8 నెలల వయసున్న కుమార్తె ఉంది. ఎలక్ట్రికల్ పనులతో పాటు వెహికల్ డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో మద్యానికి అలవాటు పడడంతో మానేయాలని భార్య కోరింది. సరేనంటూ అంగీకరించిన మల్లికార్జున అప్పుడప్పుడు మద్యం తాగి ఇంటికి చేరుకునేవాడు. ఈ నెల 13న భర్తతో కలసి యాడికిలోని పుట్టింటికి లక్ష్మి వచ్చింది. మూడు రోజుల పాటు ఎంతో సరదాగా గడిపారు.

ఆదివారం సాయంత్రం మల్లికార్జున మద్యం సేవించి ఇంటికి చేరుకోవడంతో పుట్టింటి వారి ముందు తన పరువు పోయిందంటూ లక్ష్మి బాధపడింది. తన భర్త గురించి ఎంతో మంచిగా తల్లిదండ్రులతో చెప్పుకున్నానని, ఈ రోజు తాగి వచ్చి పరువు తీశావంటూ మదనపడుతూ తనతో మాట్లాడవద్దంటూ మౌనం దాల్చింది. దీంతో మనస్తాపానికి గురైన మల్లికార్జున అదే రోజు రాత్రి 10 గంటలకు తండ్రి మారన్నకు ఫోన్ చేసి లక్ష్మి తనతో మాట్లాడడం లేదని, ఇక తాను బతికి ఉండడం వృథాగా భావించి ఆత్మహత్య చేసుకుంటున్నాని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. వెంటనే కోడలికి మారన్న ఫోన్ చేసి విషయం తెలపడంతో రామన్న కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. చివరకు ఇంటి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ కట్టడంలో లుంగీతో వేసుకున్న ఉరికి వేలాడుతున్న మల్లికార్జునను గమనించి, స్థానికుల సాయంతో కిందకు దించారు. కొన ఊపిరితో ఉండడం గమనించి వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మల్లికార్జున మృతి చెందినట్లు నిర్ధారించారు. కోడలు ద్వారా సమాచారం అందుకున్న మారన్న కుటుంబసభ్యులు యాడికికి వచ్చి మల్లికార్జున మృతదేహంపై పడి బోరున విలపించారు. మృతుడి తండ్రి మారన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గురుప్రసాద రెడ్డి తెలిపారు.

యువకుడి బలవన్మరణం



సతీష్ (ఫైల్)

అనంతపురం క్రైం: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా పాములపాడు మండలం మట్టాడు గ్రామానికి చెందిన ఎ.రాముడు కుమారుడు సతీష్ (27) బీటెక్ పూర్తి చేసి శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే తన స్నేహితులతో కలసి అనంతపురంలోని బుడ్డప్పనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. నాలుగు నెలల క్రితం అందరూ తలా ఓ వైపు వెళ్లిపోవడంతో సతీష్ ఒక్కడే ఆ ఇంట్లో ఉంటున్నాడు. ఏం జరిగిందో తెలియదు కానీ సోమవారం ఉదయం 11 గంటలకు తన చిన్ననాటి స్నేహితులైన వసుధ, శివకృష్ణకు వేర్వేరుగా వీడియో కాల్ చేసి, తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపి ఫోన్ కట్ చేశాడు. దీంతో స్నేహితులిద్దరూ వారుంటున్న ప్రాంతం నుంచి సతీష్ గదికి చేరుకునేలోపు లోపల తలుపునకు గడి పెట్టుకుని వైరుతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. స్థానికుల సహకారంతో సతీష్‌ను కిందకు దించి వెంటనే ఆటోలో ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న సతీష్ తల్లిదండ్రులు సోమవారం సాయంత్రం అనంతపురానికి చేరుకున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

చోరీ చేస్తూ పట్టుబడ్డ యువకుడు



పోలీసులు అదుపులో ఉన్న భీమయ్య

గుంతకల్లు: దుకాణంలో చోరీ చేస్తూ ఓ యువకుడు పోలీసులకు పట్టుబడ్డాడు. ఆద్యంతం సినిమాను తలపించే రీతిలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. గుంతకల్లులోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంత మార్కెట్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఇల్లూరు గోపాలకృష్ణ జనరల్ స్టోర్స్ వద్ద ఉన్న మంచి నీటి కొళాయి వద్దకు నీరు పట్టుకునేందుకు స్థానికుడొకరు చేరుకున్నారు. ఆ సమయంలో స్టోర్స్ లోపల నుంచి శబ్దాలు రావడం గమనించిన ఆయన వెంటనే స్టోర్స్ యజమాన్ని ఇల్లూరు లక్ష్మీనారాయణకు ఫోన్ చేసి తెలిపాడు. అప్రమత్తమైన ఆయన వెంటనే టూటౌన్ పోలీసులకు ఫోన్ ద్వారా విషయం తెలియజేయడంతో ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అప్పటికే అక్కడకు చేరుకున్న యజమానితో కలసి లోపల నుంచి శబ్దాలు వస్తుండడం గమనించిన పోలీసులు దుకాణానికి ఇరువైపులా కొందరిని కాపలాకు ఉంచి ఓ కానిస్టేబుల్‌ను లోపలకు పంపారు. ఆ సమయంలో లోపల ఉన్న యువకుడు కత్తి చూపించి బెదిరించడంతో కానిస్టేబుల్ వెంటనే బయటకు వచ్చి మరో ఇద్దరు కానిస్టేబుళ్లను లోపలకు పిలుచుకెళ్లాడు. దుండగుడు కనిపించకపోవడంతో దుకాణం మొత్తంగా గాలించి అటకపై దాక్కొన్న విసయం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం పట్టుబడిన యువకుడిని విజయవాడకు చెందిన కాపు భీమయ్యగా గుర్తించారు. దొంగను పట్టుకోవడంలో చాకచాక్యంగా వ్యహరించిన పోలీసులను దుకాణ యజమానితో పాటు పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు అభినందించారు.

జూద కేంద్రం నిర్వాహకుడి అరెస్ట్

రొళ్ల: మండలంలోని రంగనపల్లి శివారులో జూద కేంద్రం నిర్వహిస్తున్న శివరాజ్‌ను సోమవారం సాయంత్రం అరెస్ట్ చేసి, రూ.5,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. అందిన సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుంటుండగా గమనించిన పేకాటరాయుళ్లు పరారయ్యారన్నారు. పరారీలో ఉన్న జూదరుల కోసం గాలింపు చేపట్టినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు వివరించారు.

10 మంది జూదరుల అరెస్ట్

తాడిమర్రి: మండలంలోని దాడితోట సమీపంలో జూదం ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ నాగస్వామి తెలిపిన మేరకు... అందిన ముందస్తు సమాచారంతో సోమవారం తెల్లవారుజాము 5 గంటలకు దాడితోట సమీపంలోని చిత్రావతి నది ఒడ్డున ఉన్న గంగమ్మ ఆలయం వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని రూ.24,420 నగదు, 10 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

అనంతపురం క్రైం: వివాహిత ఆత్మహత్యాయత్నం చేసిన కేసులో అత్తింటి వారి వేధింపుల కేసును పోలీసులు నమోదు చేశారు. వివరాలను దిశ డీఎస్పీ ఆంథోనప్ప వెల్లడించారు. అనంతపురంలోని రహమత్‌నగర్‌కు చెందిన ఓబులేసు కుమార్తె ఆదిలక్ష్మికి శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం మద్దలపల్లికి చెందిన ఆనంద్‌తో 2009లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అనంతరం బతుకు తెరువు కోసం పదేళ్ల క్రితం అనంతపురానికి వలస వచ్చి కోవూరునగర్‌లో స్థిరపడ్డారు. ఈ క్రమంలో ఆనంద్ తాగుడుకు అలవాటు పడి వివాహేతర సంబంధాలు ఏర్పరుచుకుని తరచూ భార్యను హింసించేవాడు. తన జల్సాల కోసం డబ్బు తీసుకురావాలంటూ భార్యతో పాటు ఆమె తల్లిదండ్రులు చౌడమ్మ, రామాంజనేయులును వేధిస్తూ వచ్చాడు. మూడు తులాల బంగారు నగలు, 20 తులాల వెండి ఇచ్చి తమ కుమార్తెను చక్కగా చూసుకోవాలని ఆదిలక్ష్మి తల్లిదండ్రులు హితవు పలికారు. అప్పటికీ సంతృప్తి చెందని ఆనంద్ నాలుగురోజుల క్రితం భార్యతో గొడవపడి ఆమెను ఇంటి నుంచి బయటకు గెంటేశాడు. దీంతో పుట్టింటికి చేరుకున్న ఆమె ఆదివారం తన బంగారు, వెండి వస్తువులు తెచ్చుకునేందుకు భర్త ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో భర్తతో పాటు అత్తమామలు అవమానకరంగా మాట్లాడడంతో మనస్తాపం చెందిన ఆదిలక్ష్మి అదే రోజు రాత్రి విషపూరిత ద్రావకం తాగింది. కుటుంబసభ్యులు ఆమెను ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అత్తింటి వారిపై వేధింపుల కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టినట్లు దిశ పోలీసులు తెలిపారు.

రూ.2 లక్షల పొదుపు సొమ్ము మాయం



ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా సంఘం సభ్యులు

పెనుకొండ రూరల్: మండలంలోని చిన్నపరెడ్డిపల్లిలో సత్యసాయి డ్వాక్రా మహిళా పొదుపు సంఘంలో దాదాపుగా రూ.2 లక్షల పొదుపు మాయమైంది. గ్రూపు లీడర్లు లక్ష్మీదేవి, పార్వతమ్మ డబ్బు కాజేశారని డ్వాక్రా సభ్యులు గంగమ్మ, అనిత, కాంతమ్మ, శివమ్మ తదితరులు సోమవారం కియా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. అయితే ఈ ఘటనపై ఏపీఎం నాగేంద్రను 'సాక్షి' వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని తెలిపారు.

పరుపుల దుకాణం దగ్ధం

అనంతపురం క్రైం: నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో సీమా ఆప్టికల్స్ పక్కనే ఉన్న పరుపుల దుకాణంలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం రాత్రి 8.45 గంటలకు మంటలు చెలరేగాయి. పెద్ద ఎత్తున పొగలు వ్యాపించాయి. దుకాణదారు బాషా సమాచారంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే దుకాణంలోని పరుపులు, ముడిసరుకు కాలి బూడిదైంది. దాదాపు రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న నగర మేయర్ వసీం అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుడిని పరామర్శించి, ధైర్యం చెప్పారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్‌మెన్‌లు


జనవాక్కు

పేదలంతా జగన్ వెంటే



గతంలో ఏ ప్రభుత్వమూ పేదల బాగోగులు పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్ ఒక్కరే అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చారు. నాకు ఇంటి స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరు చేశారు. వైఎస్సార్ చేయూత పథకం కింద నా భార్య శశిరేఖకు ఏటా 18,750, వైఎస్సార్ ఆసరా పథకం కింద ఏటా రూ.7వేలు చొప్పున లబ్ధి చేకూరింది. రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందజేశారు. ఈ మొత్తంతో పెట్టుబడి లేని వ్యవసాయం చేసి లాభపడ్డాం. ఆర్థిక ఇబ్బందులు తీరాయి. పేదలకు ఎంతో మేలు చేసిన జగన్‌ను ఎవరూ మరిచి పోలేదు. అందుకే పేదలంతా జగన్ వెంటే నిలుస్తున్నారు.
– రాకెట్ల శ్రీరాములు, రాజీవ్ కాలనీ, వజ్రకరూరు

పిల్లల చదువుకు ఢోకా లేదు



నేను, నా భర్త గంగరాజు కూలి పనులతో జీవనం సాగిస్తున్నాం. ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కూలీ డబ్బుతో కుటుంబ పోషణే భారంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో మా పిల్లల చదువులు ఎట్లా అని బాధపడేవాళ్లం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ బడుల్లోనే ఇంగ్లిష్ మీడియం చదువులు ప్రవేశపెట్టి సీఎం జగనన్న ఎంతో మేలు చేశారు. అంతేకాక అమ్మ ఒడి పథకం లబ్ధి చేకూరడంతో పిల్లల చదువులకు ఇబ్బంది లేకుండా పోయింది. డబ్బున్న పిల్లలతో సమానంగా మా పిల్లలూ ఊరి బడిలోనే ఇంగ్లిష్ చదువులు చదువుతుంటే ఎంతో ఆనందంగా ఉంది.
– గంగాదేవి, పుప్పాల, యాడికి మండలం

లక్షాధికారిని చేశారు



నా భర్త లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయన సంపాదన ఇంటి బాడుగ, కుటుంబపోషణకు సరిపోయేది కాదు. సొంతిల్లు కోసం గత ప్రభుత్వంలో చేయని ప్రయత్నమంటూ లేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి వివరాలు తీసుకెళ్లి గార్లదిన్నె రైల్వే స్టేషన్ సమీపంలో రూ.లక్షలు విలువ చేసే ఇంటి స్థలానికి పట్టా తీసుకొచ్చి ఇచ్చాడు. ఆ స్థలంలోనే ప్రభుత్వ సహకారంతో ఇల్లు కూడా నిర్మించుకున్నాం. సొంతింట్లో ఎంతో సంతోషంగా జీవిస్తున్నాం. పూట గడవక ఇబ్బంది పడే స్థితి నుంచి నన్ను లక్షాధికారిని చేసిన సీఎం వైఎస్ జగనన్నకు ఎంతో రుణపడి ఉన్నాం. – అనిత, గార్లదిన్నె

మేలు జరిగింది



సీఎం వైఎస్ జగన్‌తోనే మా కుటుంబానికి మేలు జరిగింది. ఎలాంటి సిఫారసు లేకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందాయి. ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల వారికీ అండగా నిలవాలన్న సంకల్పంతో ప్రవేశపెట్టిన ఓబీసీ పథకం ద్వారా నా భార్య వసుంధరకు ఏటా రూ.15వేల లబ్ధి చేకూరుతోంది. ఇంటి స్థలంతో పాటు గృహ నిర్మాణమూ మంజూరు చేశారు. ఇంటి నిర్మాణ పనులు సాగుతున్నాయి. పేదలకు మంచిచేసే వైఎస్ జగనే సీఎంగా ఉండాలి.
– శ్రీనివాసరావు, బ్రాహ్మణవీధి, వజ్రకరూరు

రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థి మృతి

పావగడ: బైక్‌ను బొలెరో ఢీ కొన్న ప్రమాదంలో ఓ డిగ్రీ విద్యార్థి మృతి చెందగా, మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ గురుమూర్తి తెలిపిన వివరాల మేరకు...దేవరబెట్టకు చెందిన నవీన్‌కుమార్ (22), ప్రశాంత్ పావగడలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. సోమవారం ఇద్దరూ కలిసి బైక్‌పై కళాశాలకు బయలుదేరారు. వీరు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్లహళ్ళి గ్రామం వద్దకు రాగానే ఎదురుగా వచ్చి బొలెరో వాహనం బైకును ఢీకొనడంతో నవీన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రశాంత్‌కు తీవ్ర గాయాలు కాగా, మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ గురుస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గుడిబండ: నిర్మాణంలో ఉన్న ఇంట్లో విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. కర్ణాటకలోని మధుగిరి పట్టణానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు శివరాజు (45).. టైల్స్ వేసే పనితో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గుడిబండ మండలం తాళకెర గ్రామంలో ఓ ఇంట్లో టైల్స్ వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని గమనించిన అక్కడున్న వారు వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థిని ఆత్మహత్య

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం ఎ.కొండాపురం గ్రామానికి చెందిన కవిత (21) బీకేఎస్ మండలంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం హాస్టల్ గదిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. కాగా, విద్యార్థిని ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.